క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

వీధుల్లో చెత్త కనిపిస్తే చర్యలు



సూర్యాబాగ్ వద్ద చెత్త ఎత్తిస్తున్న జెడ్సీ ప్రసాదరావు

జగదాంబ : వన్‌టౌన్ ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉండాలని, వీధుల్లో చెత్త కనిపిస్తే చర్యలు తప్పవని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ పీవీపీడీ ప్రసాదరావు అన్నారు. శుక్రవారం జోన్ పరిధిలోని 12 వార్డుల్లో పర్యటించారు. జీవీఎంసీ 31వ వార్డులో వీధులన్నీ పరిశీలించారు. సూర్యాబాగ్ దరి ఓ వీధిలో చెత్త చూసిన ఆయన ఆ చెత్తకుప్పలు ఎత్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగదాంబ వంటి ప్రాంతాన్ని ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వార్డుల్లో డంపర్ బిన్ల వాడకం తగ్గించి సిబ్బంది, ప్రజలు స్వయంగా క్లాప్ వాహనంలో చెత్త వేసేలా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ఉదయం ఆరు గంటలకల్లా క్లాప్ వాహనాలు వార్డుల్లో చెత్త సేకరణ ప్రారంభించాలన్నారు. కాలువలు, ప్రధాన రహదారులు ఎప్పటిప్పుడు శుభ్రం చేయాలన్నారు. గెడ్డల పూడికలు తీసి మురుగు నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టర్లు

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంప చంద్రమౌళి శుక్రవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించకపోతే మార్చి 1 నుంచి జీవీఎంసీ పరిధిలో జరుగుతున్న పనులు నిలిపివేస్తామని మేయర్‌కు తెలిపారు. మేయర్ స్పందిస్తూ కమిషనర్ సాయికాంత్‌వర్మతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. మేయర్‌ను కలిసిన వారిలో కార్యదర్శి రంధి సాధూరావు, ఉపాధ్యక్షులు పీఎస్ ప్రసాద్, పీపీ రాజు, బి రామునాయుడు, సలహాదారులు వీరభద్రరావు, ఆర్ఎస్ నాయుడు, నాగరాజు, పూర్ణచంద్రరావు, ఆడిటర్ ఎస్. రవీంద్ర, సహాయ కార్యదర్శులు పిల్లా సూరిబాబు, ఎంవీ సత్యనారాయణ, పలువురు సభ్యులు, కాంట్రాక్టర్లు ఉన్నారు.

భాషతో మానవజాతి వికాసం

ఏయూ క్యాంపస్: భాషలు మానవజాతి వికాసాన్ని తెలియజేస్తాయని విశ్రాంత ఆచార్యులు పర్వతనేని సుబ్బారావు అన్నారు. ఏయూ తెలుగు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన అతిథి ప్రసంగం చేశారు. ప్రపంచంలో కొన్ని వేల భాషలు ఉన్నాయని, ఆయా భాషలు జాతి వికాసానికి దోహదం చేశాయన్నారు.

సేవా కుసుమాలు

- ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించే గురుతర బాధ్యతలో వలంటీర్లు
- సీఎం జగన్ ఆశయాల అమలులో అలుపెరుగని కృషి
- వేనోళ్ల కొనియాడుతున్న ప్రజలు

సంక్షేమ పథకాలు ప్రకటించడం అన్ని ప్రభుత్వాలు చేస్తాయి. అయితే అవి ఎంత మందికి చేరుతున్నాయి.. ప్రభుత్వ ఉద్దేశం సంపూర్ణంగా నెరవేరుతుందా లేదా అన్నది ఇంత వరకు పెద్దగా ఏ ప్రభుత్వాలు ఆలోచన చేయలేదు. అందుకే గతంలో ఏ కొందరికో ప్రభుత్వ పథకాలు అందేవి. మిగతాదంతా చేతివాటం ప్రదర్శించే వారి జేబుల్లోకి పోయేది. అయితే సీఎం జగన్ మాత్రం అటువంటి వాటికి తావీయకుండా ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి పైసా పేదలకు నేరుగా చేరాలని కంకణం కట్టుకుని ప్రజా సంక్షేమానికి పాటు పడుతున్నారు. అందులో భాగంగా పేదల ముంగిళ్ల వద్దకెళ్లి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా వారికే అందించే ఉద్దేశ్యంతో వలంటీర్ వ్యవస్థకు రూపునిచ్చారు. ముఖ్యమంత్రి మానస పుత్రికగా పేరు తెచ్చుకున్న వలంటీర్ వ్యవస్థ నేడు పేదలు, బడుగు బలహీన వర్గాల ఆదరాభిమానాలు చూరగొంది. తమ మేలు కోసం అనుక్షణం తపిస్తున్న సీఎం ఆదరాభిమానాలకు చెమర్చిన కళ్లతో పేద ప్రజలు దీవెనలందిస్తున్నారు. వలంటీర్లకు ఇదే విషయం వారు విశదీకరిస్తున్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందజేస్తున్న వలంటీర్ అర్చన



లబ్ధిదారుకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అల్లూరి సుజాత


దాబాగార్డెన్స్ : ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారులకే అందాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో రకాల పథకాలు అందిస్తోంది. ప్రజల సంక్షేమం కోసం వినూత్నమైన స్కీమ్స్ అందుబాటులోకి తెచ్చింది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల దగ్గరి నుంచి సీనియర్ సిటిజన్స్ వరకు చాలా మంది ఈ పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రయోజనాలను అర్హత గల లబ్ధిదారులకు ఇంటి వద్దకే చేరవేయడం వలంటీర్ల బాధ్యత. వలంటీర్ వ్యవస్థ ద్వారా గ్రామాల్లో ప్రజలు సులభంగా ప్రభుత్వ సేవలు పొందుతున్నారు. మహాత్మాగాంధీ చెప్పినట్టు పల్లెటూళ్లు దేశానికి పట్టుగొమ్మలు అనే మాటను జగన్‌మోహన్‌రెడ్డి నిజం చేశారని చెప్పుకోవచ్చు.

ప్రజలు.. ప్రభుత్వానికి మధ్య వారధులు..

వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు కావడంతో ప్రజల ముంగిటకే పాలన వచ్చింది. ప్రభుత్వం, రాష్ట్ర ప్రజల మధ్య వలంటీర్ వ్యవస్థ వారధిగా నిలుస్తోంది. ఒక్కో వలంటీర్ 50 కుటుంబాలను కవర్ చేస్తున్నారు. ప్రభుత్వ పథకాల గురించిన సమాచారం లబ్ధిదారులకు తెలియజేయడం, అర్హతలను అనుసరించి ఆయా పథకాలకు దరఖాస్తు చేయించడం వంటి సేవలను వలంటీర్లు అందిస్తున్నారు.

చక్కటి ప్రోత్సాహం..

దక్షిణ నియోజకవర్గం నుంచి 16 మంది సేవా రత్న అవార్డులు సాధిస్తే.. ఐదుగురు సేవా వజ్ర అవార్డులు పొందారు. వీరిని ప్రోత్సహించే విషయమై రాష్ట్ర ప్రభుత్వం వీరికి ప్రోత్సాహక నగదు బహుమతులను 50 శాతం మేర పెంచింది. రూ.10 వేలు ఉండే సేవామిత్రకు రూ.15 వేలు, రూ.20 వేలు ఉండే సేవా రత్నకు రూ.30 వేలు, రూ.30 వేలు ఉండే సేవా వజ్రకు రూ.45 వేలు చొప్పున ఇటీవల ప్రభుత్వం వీరిని ప్రోత్సహిస్తూ అందజేసింది.





వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

వలంటీర్ల ద్వారా సంక్షేమ కార్యక్రమాలు..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించి, వారి ద్వారా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు మరింత సేవలందిస్తూ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. వలంటీర్లంటే జగనన్నకు ప్రజాప్రతినిధుల కన్నా ఎక్కువ.
– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్, గ్రేటర్ విశాఖపట్నం

మంచి గుర్తింపు..



ప్రతిష్టాత్మకంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారులకు అందించేందుకు నా వంతుగా కృషి చేస్తున్నా. నా సేవలను గుర్తించినందుకు చాలా ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాలాంటి వారికి ఉపాధి కల్పించడమే కాక సేవ చేసే భాగ్యం కూడా అందించారు. చాలా సంతోషంగా ఉంది.
– టేకేటి శ్యామ్ సాయికుమార్, హిందూ ముస్లిం కాలనీ, సేవా రత్న అవార్డు గ్రహీత

సేవలందించడం ఓ హాబీ..



గత నాలుగున్నరేళ్లుగా వృద్ధులు.. వికలాంగులు, వితంతువులకు సేవలందిస్తుండడంతో ఆ పని ఓ హాబీగా మారిపోయింది. ఇందులోనే ఆనందం ఉంది. పది మందికి సేవ చేసే భాగ్యం కల్పించినందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. సేవలందిస్తున్న వారిని గుర్తించి మరింత ప్రోత్సహించేందుకు అవార్డులతో సత్కరించడం అభినందనీయం
– టి. అర్చన, సేవా వజ్ర అవార్డు గ్రహీత

రక్షణగిరిలో శిలువ మార్గ ప్రార్థనలు



శిలువ మార్గాన్ని చూపిస్తున్న ఫాదర్ ఆనంద్

కంచరపాలెం : క్రీస్తు ప్రభువు నందు రక్షణ భయభక్తులు కలిగి ఉండి జీవనం సాగించాలని జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం ఫాదర్ ఆనంద్ అన్నారు. పాస్కా కాలాన్ని పురస్కరించుకుని శుక్రవారం పునీత పేతురు దేవాలయం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో రక్షణగిరి పుణ్య క్షేత్రం వరకు పరిశుద్ధ శిలువ మార్గాన్ని ఘనంగా నిర్వహించారు. ఫాదర్ ఆనంద్ మాట్లాడుతూ భూలోక జ్ఞానం క్రీస్తునందు భయభక్తులు కలిగి ఉండడం ద్వారా లభిస్తుందన్నారు. యెహోవా యందలి భయభక్తులు కలిగి ఉండటమే జ్ఞానానికి మూలం అని పరిశుద్ధ బైబిల్ గ్రంథంలో సూచించబడిందన్నారు. మార్చి 29న జరిగే గుడ్‌ఫ్రైడే వేడుకలకు రక్షణగిరిని ముస్తాబు చేస్తున్నట్లు ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ తెలిపారు.

ప్రమాదవశాత్తు జారిపడిన వ్యక్తి మృతి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఇంట్లో జారిపడి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురంలో నివసిస్తున్న దుక్కా ఆనంద్(46) అనే వ్యక్తి పెయింటర్‌గా పనిచేస్తుంటాడు. ఈ నెల 19వ తేదీ రాత్రి ఇంట్లో బాత్రూంకి వెళ్లి ప్రమాదవశాత్తు జారి పడిపోవడంతో గాయాలయ్యాయి. దీంతో అతడిని కేజీహెచ్‌కు తరలించారు. సదరు వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో మృతిచెందాడు. అతడి భార్య దుక్కా రామలక్ష్మి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.భాస్కర్‌రావు నేతృత్వంలో ఏఎస్‌ఐ రాజారావు కేసు దర్యాప్తు చేపట్టారు.

కేజీహెచ్‌లో పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్



పిల్లల వార్డులో కొత్తగా నిర్మిస్తున్న పీఐసీయూ యూనిట్



శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు

- 27న ప్రారంభించనున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని
- రూ.80 లక్షల వ్యయంతో పలు సౌకర్యాల ఏర్పాటు

మహారాణిపేట : కేజీహెచ్ పిల్లల వార్డులో రూ. 80 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ) ఈనెల 27న ప్రారంభం అవుతుంది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ఈ యూనిట్‌ను ప్రారంభిస్తారని సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ శుక్రవారం మీడియా ప్రతినిధులకు తెలిపారు. మొత్తం 40 పడకలతో ఏర్పాటు చేస్తున్న ఈ యూనిట్‌లో ఒక ఏడాది నుంచి ఏడు సంవత్సరాల లోపు పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసం చికిత్స అందిస్తామన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ నిధులు రూ. 20 లక్షలు, కేజీహెచ్ నిధులు రూ. 20 లక్షలు, కలెక్టర్ మల్లికార్జున అందించే సీఎస్ఆర్ ఫండ్ రూ. 40 లక్షలతో ఈ యూనిట్ నిర్మిస్తున్నామన్నారు. వెంటిలేటర్ వంటి సదుపాయాలు పొందుపరుస్తున్నామని తెలిపారు. అలాగే కేజీహెచ్‌లో 120 సీసీ కెమెరాలు అమర్చుతున్నామన్నారు.



శుక్రవారం సమ్మక్క సారమ్మ జాతరలో పాల్గొని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

కేజీహెచ్‌కు రోగుల గౌన్లు, క్యాప్‌ల విరాళం





రోగుల గౌన్లు, క్యాప్‌లు డాక్టర్ అశోక్‌కుమార్‌కు అందజేస్తున్న దాతలు

మహారాణిపేట :కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులకు దాతలు పేషెంట్ గౌన్లు, క్యాప్‌లు అందజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇండియా, రౌండ్ టేబుల్ ఆఫ్ ఇండియా సంస్థలు 50 పేషెంట్ గౌన్లు, 70 క్యాప్‌లు విరాళంగా అందించాయి. శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్‌కు వీటిని అందజేశారు. లేడీస్ సర్కిల్ ఇండియా ప్రెసిడెంట్ సీఆర్ చెరిల్ సంతోష్, వీకేఎల్‌సీ చైర్‌పర్సన్ స్వీటీ జోషి, కార్యదర్శి అక్ష రాజ్‌పుట్, వైస్ చైరపర్సన్ అభిజ్ఞ గ్రంధి పాల్గొన్నారు. ఏరియా ప్రాజెక్టు కన్వీనర్లు శ్వేత, సందీప్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసుపల్లి రవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ తృప్తి యర్రమిల్లి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం



వలంటీర్లను సత్కరిస్తున్న కొల్లి సింహాచలం, సనపల రవీంద్ర తదితరులు

జగదాంబ : ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో అందిస్తున్న వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని జీవీఎంసీ 36, 38, 39 వార్డుల వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు కొనియాడారు. శుక్రవారం జీవీఎంసీ 39వ వార్డు ఇన్‌చార్జి కొల్లి సింహాచలం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆంగ్లో ఇండియన్ కమ్యూనిటీ హాల్లో వలంటీర్లకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న మానస పుత్రికగా భావిస్తున్న వలంటీర్లను సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. మండల జేసీఎస్ కన్వీనర్ సనపల రవీంద్ర మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో వలంటీర్లు ప్రజలకు చేస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతరం సేవా రత్న, సేవా మిత్రగా ఎంపికైన వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, బూత్ ప్రెసిడెంట్లు, కార్యకర్తలు, సచివాయల అడ్మిన్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ టికెట్‌కు కస్తూరి దరఖాస్తు



కాంగ్రెస్ పార్టీ తరఫున దరఖాస్తు అందజేస్తున్న కస్తూరి వెంకట్రావు

దాబాగార్డెన్స్ : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో దక్షిణ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు రెల్లి కులానికి చెందిన కస్తూరి వెంకట్రావు దరఖాస్తు చేసుకున్నారు. విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ 33 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ పార్టీకి సేవలందిస్తూ వచ్చానన్నారు. మర్రి చెన్నారెడ్డి, జనార్దనరెడ్డి, వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి సారథ్యంలో పార్టీకి సేవలందించానని చెప్పారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఎస్సీలకు 29 నియోజక వర్గాలుండగా కనీసం ఒక్కటైనా రెల్లి కులానికి చెందిన తనకు కేటాయించాలని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు.

అన్నదాతను కాల్చి చంపడం అమానుషం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

సీతమ్మధార : దేశ ప్రజలకు అన్నం పెడుతున్న రైతులపై బీజేపీ ప్రభుత్వం కాల్పులు జరిపించి శుభ్‌కరణ్ సింగ్ అనే రైతును పొట్టన పెట్టుకున్న హర్యానా ముఖ్యమంత్రి ఎంఎల్ కట్టర్, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే రాజీనామా చేయాలని విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రైతుల కాల్పులు, హత్యకు నిరసనగా దేశ వ్యాప్తంగా శుక్రవారం అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బ్లాక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ దేశం సుభిక్షంగా ఉండాలంటే రైతులు సుఖసంతోషాలుతో ఉండాలన్నారు. ఎరువులు, విత్తనాలు పురుగు మందుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. వీటిపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలపై భారీగా కోత పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి టి.అచ్యుతరావు, కె.శంకరావు, కె.ఈశ్వరరావు, బి.జగన్, పి.మణి, వి.కృష్ణారావు, ఎం.మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

మోదీ, షా గద్దె దిగాలి..

అల్లిపురం : అన్నదాతను బీజేపీ ప్రభుత్వం కాల్చి చంపడం అమానుషమని ఐద్వా కేంద్ర కమిటీ స్పష్టం చేసింది. ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా, హర్యానా ముఖ్యమంత్రి ఎంఎల్ కట్టర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఐద్వా అఖిల భారత సమావేశాలు జరుగుతున్న సందర్భంగా దాబాగార్డెన్స్ వద్ద బారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఐద్వా అఖిల భారత కార్యదర్శి పీకే శ్రీమతి, మరియం ధావలే, కోశాధికారి పుణ్యవతి మాట్లాడారు. కార్యక్రమంలో ఆలిండియా ఐద్వా నాయకులు సుజాత, కీర్తి సింగ్, సీమ, ప్రకృతి, సుసంకోడి, ఇషితా, షబ్బానిలతో పాటు ఐద్వా రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప సిద్ధితో అనుకున్నది సాధించవచ్చు

అల్లిపురం : సంకల్ప సిద్ధితో అనుకున్నది సాధించవచ్చని విద్యాశాఖాధికారి చంద్రకళ అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను సంకల్పం కార్యక్రమానికి సంబంధించి ప్రశ్నలు అడిగి విద్యార్థులు చెప్పిన సమాధానాలకు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సమస్యలకు తలొగ్గరాదన్నారు. సమస్యలు వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో మెలగాలన్నారు. జీవితంలో సమస్యలు వచ్చినప్పుడు జీవన నైపుణ్యాలు ఎంతగానే ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎ.గౌరీశంకర్, ఎస్.ఎస్.ఎ. ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు ఆర్‌వీవీఎస్ నాగభూషణం, ఫిజికల్ డైరెక్టర్ ఎ.రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సుకు తరలి వెళ్లిన న్యాయవాదులు



సదస్సుకు తరలి వెళ్తున్న లీగల్ సెల్ ప్రతినిధులు

అల్లిపురం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ న్యాయ విభాగం రాష్ట్ర సదస్సుకు విశాఖపట్నం జిల్లా న్యాయ విభాగం న్యాయవాదులు పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు బాజీనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం తరలి వెళ్లారు. లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో తాడేపల్లిలో శనివారం జరగనున్న రాష్ట్ర స్థాయి సదస్సులో రాబోయే ఎలక్షన్ల ప్రక్రియపై రాష్ట్రంలో గల 175 నియోజకవర్గాల నుంచి న్యాయవాదులు హాజరవుతున్నట్లు లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా ఇన్‌చార్జి జీఎం రెడ్డి, రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు కాళిదాస్‌రెడ్డి, కార్యదర్శి త్రినాథమూర్తి, జాయింట్ సెక్రటరీ గాలి రామిరెడ్డి, వి.శ్రీనివాస్, బగాది తులసీదాస్, ఆర్ఎస్ రవి, పరదేశి రెడ్డి, సింహాద్రి తదితరులు ఉన్నారు.

ముస్లింలను ఓటు బ్యాంక్‌గా వాడుకున్న చంద్రబాబు



మాట్లాడుతున్న కేవీ బాబా

కొమ్మాది: నాడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ముస్లింలను ఓటు బ్యాంక్‌గా వాడుకున్నారని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు కేవీ బాబా ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ముస్లింల ద్రోహి అని టీడీపీ నేత నజీర్ విమర్శించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి ప్రభుత్వ పథకాలను దళారీ వ్యవస్థలు లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాల్లో వేసి, పేదవారికి అండగా ఉన్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ఇష్టానుసారం దోచుకునే వారని, కానీ నేడు వైఎస్సార్‌సీపీ పాలనలో అవినీతికి, లంచాలకు తావు లేకుండా వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టి వైఎస్ జగన్ జన హృదయ నేతగా నిలిచారన్నారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సుమారు రూ. 24 వేల కోట్లు అందజేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డిది అన్నారు. నాడు చంద్రబాబు పాలనలో షాదీ తోఫా కింద రూ. 50 వేలు అందిస్తే నేడు సీఎం జగన్ రూ. లక్ష అందిస్తున్నారని, 2022–23 హజ్ యాత్రలకు వెళ్లిన 2977 హాజీలకు రూ. 20కోట్ల 3 లక్షలు ఖర్చు పెట్టిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. ఆక్రమణలకు గురైన 32 వేల ఎకరాల వక్ఫ్ ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు స్వతంత్ర అధికారాలు ఇస్తూ వక్ఫ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసిన మైనారిటీల పక్షపాతి సీఎం జగన్ అని కొనియాడారు. చంద్రబాబు హయాంలో ఇమామ్‌లకు ఇచ్చే రూ. 5వేలును పది వేలకు, మౌజన్‌లకు ఇచ్చే రూ.3 వేలను రూ.5వేలకు పెంచిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు.

ఏవీఎన్ కళాశాలకు బీఎన్‌రెడ్డి విరాళం



విరాళం అందజేస్తున్న ఇంద్రజాలికుడు బీఎన్ రెడ్డి

దాబాగార్డెన్స్: నగరానికి చెందిన ప్రముఖ ఇంద్రజాలికుడు బీఎన్‌రెడ్డి తాను చదివిన ఏవీఎన్ కళాశాలకు రూ.లక్ష విరాళం అందజేశారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు, ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడుకు ఈ మొత్తం చెక్‌ను అందజేశారు. ఈ మొత్తంపై వచ్చే వడ్డీతో కళా రంగంలో ప్రతిభ చూపే కళాశాల విద్యార్థికి ఏటా నగదు పురస్కారం అందజేయనున్నారు. కళాశాల పూర్వ విద్యార్థి బీఎన్ రెడ్డి ఇంద్రజాల విద్యలో అంతర్జాతీయస్థాయి గుర్తింపు పొందడం తమకు ఎంతో గర్వకారణమని భానోజీరావు తెలిపారు. ఈ సందర్భంగా బీఎన్‌రెడ్డిని అభినందించారు.

లలితాదేవి నగరోత్సవం నేడు

సీతంపేట: లలితానగర్‌లోని శ్రీలలితా పీఠం 75వ వార్షికోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం అమ్మవారికి పసుపు, కుంకుమలతో పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి విశేష అలంకారం చేశారు. ముగింపు సందర్భంగా శనివారం సాయంత్రం లలితా అమ్మవారికి విశేష నగరోత్సవం నిర్వహించనున్నారు.